## బడెయ్య

మాదిగ్గూడెం అంతా టంగ్...టంగ్...టంగ్ అనే చప్పుళ్ళతో నిండి పోయింది. అవి ముదిరిన ఎండలు. వాడలోల్లకు కూలినాలి దొరకడం కష్టం. ప్రతి గడప నుండి ఇద్దరు ముగ్గరేసి మనుషులు అడివికి పోయి తంగెడు చెక్కను కొట్టుకొచ్చి ఇండ్లల్ల కూసోని దాన్ని పొతం జేసుడు రోజువారి పని అయింది. గూడెంలో ఉన్న నలపై ఇండ్లల్ల యా ఇంట్ల జూసినా ఇదే పని. పెద్దలు ఇండ్లల్ల తంగెడు కట్టె జెక్కె పని జేస్తె పిల్లలు ఆరుబయట వాకిల్లల్ల ఆడుకుంటున్నరు.

కోడికూయక ముందే మూడు జాముల పొద్దుకు ఎంకయ్య ఎల్లమ్మ ఇద్దరూ అడివికి తంగెడు చెక్క తేను పోయింండ్రు. అంబటాల్లకల్ల తంగెడుజెక్క మోపులతో ఇంటికి జేరిండ్రు. సెరీ గురిగెడు కలి అంబలిని నిలవడే తాగింండ్రు. కాల్లు జేతులుకడుక్కోని ఇడుపరుగుమీద కూసోని దమ్ముతీసుకున్నరు. 'ఇగ బువ్వ తినుండి బాపు' అని పెద్దబిడ్డ సమ్మక్క బువ్వ పచ్చిపులుసు తలెలల్ల ఏసుకొచ్చింది.'చెల్లెండ్లు తమ్ముండ్లు ఏరి బిడ్డా' అని ఎల్లమ్మ అడిగింది. ఎంకయ్య అయితే తినేకాడికేంచి లేసి బయటకొచ్చి 'ఓరి....బడెయ్యో..... అని కూతేసిండు. ఒక కూతకు పలకలేదు. రెండో కూతకు బడెయ్య యాడున్నెడో గాని బొక్కబండి చేతుల వట్టుకోని 'ఓ.....వస్తున్న..వస్తున్న' అనుకుంట దమ్ముకురాంగ ఉరికచ్చిండు.

బడెయ్య అంటె ఆ ఇంట్ల ఓ ప్రత్యేకమైన అభిమానం. ఇంటొల్లకే కాదు మాదిగవాడల మొత్తమూ అంతే..... ఎందుకో?

బడెయ్యకు ఈ ఒక్క పేరే లేదు. తల్లి ఒక పేరు వెట్టుకున్నది. తండ్రి ఇంకోపేరు వెట్టుకున్నడు. అందరిలో ఈ ఒక్కడే బడికి పోయేటందుకు 'బడెయ్య' అని పేరు వడింది. కందిసేండ్ల పురుగు ముట్టి (పాముకరిసి) చనిపోయిన తన అన్న మైసయ్య అంటే ఆమెకెంతో అభిమానం. తన అన్న పేరు మునగకుండ (ఎవరూ మరిచిపోకుండా) కొడుక్కు మైశయ్య అన్నపేరు వెట్టుకున్నది. ఈ బడెయ్య పుట్టిన ఏడు మందిల ఆఖరోడు. ముద్దుగా ముత్యమోలె ఉన్నడని ముత్తయ్య అని పేరు వెట్టింండ్రు. తల్లేమో మైశయ్యా..... అని పిలుస్తది, తండ్రేమో ముత్తయ్యో....... అని పిలుస్తడు. సిన్నమ్మ, పెద్దమ్మలు, సిన్నాయినలు, మిగతా కులపోల్లు బడెయ్యో...... అపి పిలుస్తరు.

ఆడుకునే బొమ్మలను తయారు చేయడంలో బడుయ్యది తెలివే తెలివి. సచ్చిన పశువులను ఊరు బయటికి గుంజేసే వతన్‌లో తండ్రి ఉన్నడు. తండ్రి వంతు వచ్చినప్పుడు సచ్చిన దూడను గుంజడంతో పాటు దాన్ని కోసి, తోలు తీసి కుప్పలేసిందాక తండ్రెంబడే నిలబడి దూడ తలను సోంతం జేసుకునేది. తండ్రిని ఎంబడించి బొక్క బండిని సాధించెటోడు. దూడ తలబొక్కని బాగా ఎండబెట్టేది. దాన్ని ఎల్లొంకలేసి నడుమ జెర్రంత బొక్క తుకుడను తిసేది. దానికి రొండొంకల సెవుల కాడున్న పొక్కల్లకేంచి పొడుగాటి జనుప తాడును గట్టి బండిని తయారు చేయడంలో బడెయ్యను మించినోడు లేడు. ఈ బొక్క బండికి కట్టిన రెండు తాల్లకు ఇద్దరు పిల్లలు అటొకరిటొకరిని ఎడ్లలాగ ఒంగవెట్టి బండి గట్టి గుంజేటోళ్లు. దానిలోఎరువును నింపి సేనుకు ఎరువుకొట్టుడు ఆట ఆడేటోళ్లు. ఈ బడెయ్యకు బడికి

పోవుడంటే మహా సంబర మయ్యేది. బడికి పోయినపుడు మాత్రం మైలతదని తరగతిలో చివర కిందకూర్చోబెట్టేది. పంతులు జెప్పే ప్రతిపాఠాన్ని మనుసువెట్టి వినేటోడు. మరుసటి దినం పంతులిచ్చిన ఇంటి పనిని తప్పకుండా నేర్చుకొని గడ గడా అప్పజెప్పేది. అప్పజెప్పినా మాదిగోడైనందుకు బడెయ్య సీటు ఎనక నుండి ఎన్నడూ ముందుకు రాలేదు.

తండ్రి పిలిచిన పిలుపుకు బడెయ్యతో పాటు అన్నలిద్దరూ అక్కలిద్దరు కూడా ఉరికచ్చింండ్రు. అందరూ కూసోని తలాయింత బువ్వ పచ్చిపులుసు తిన్నరు. తరువాత ఎవరిపనిలో వారు మునిగిపోయింండ్రు. ఎంకయ్య తోల్లు, ఆరే, దారం, గూటం, ఇన్ని తిత్తిల నీల్లు తీసుకొని సెప్పులు గుట్టే తావు మీదకి పోయిండు. ఎల్లమ్మనేమో తెచ్చిన తంగెడు చెక్కను మట్టగ పేర్చుకొని, ఎండవెట్టుడు దాని నారను జీరుడు మొదలు వెట్టింది. ఇగ బడెయ్య బొక్క బండి తీసుకొని పిల్లల గుంపునేసుకొని ఎరువు బండిగట్టవోయిండు. ఇండ్లపక్క సందులల్ల చిన్న చిన్న గుంతలుదొవ్వి పొద్దుమూకినయాల్ల ఊరుబయటికి వోయి పశువుల పెండను, పిడుకలను ఏరుకొచ్చి ఆ గుంతల్ల జమజేసేది. పిల్లల తల్లులేమో పొద్దు పొద్దున్నే తెల్లవారు జామునే ఆ గుంతల్ల ఉన్న పచ్చిపెండను బుట్టలల్ల నింపుకచ్చి వాకిల్లల్ల సానిపి జల్లేది. గుంత నిత్తె ఇంత ఎలితినే అయ్యేది. 'మా పెంటలకేంచి పెండను దోసే దొంగలెవరబ్బా' అని పిల్లలు తెగ ఆలోచించింండ్రు. మాటుగాసి మరీ దొంగలను పసిగట్టింండ్రు. తల్లులతో కయ్యానికి దిగవోయి తండ్రులకు జెప్తం అనేటాల్లకు సర్దుకునేటోళ్ళు.

పొలం ఆటలో తమ కోసం తాము తయారు జేసింండ్రు. గుంతలో అడుగున ఉన్న ఎరువును బొక్క బండితో పొలంకు జేర్చింండ్రు. ఊరు బయట మనుషులు నడిసి గట్టివడ్డ బాట పక్కన జెర్రంత జాగను ఎంపిక చేసింండ్రు. బొమ్మనాగండ్లతో దున్ని సుట్టూ ఒరం బోసింండ్రు. నడ్మ బందాలు కట్టింండ్రు. ఇంట్లకేంచి ఒడ్లు, జొన్నలు తీసుకపోయి సాల్లేసింండ్రు. ఏం లాభం సందెల్లకు అడివిలకేంచి ఊర్లకొచ్చే దూళ్ళు, మనుషులు నడ్సుడుకు పొలం తొక్కుడయి,కరాబయి, గట్టివడి మామూలు బాట అయ్యింది. 'అయ్యో పిల్లలు కష్టపడి భూమిని మెదగ్గొట్టి సాగుచేసిన పొలం నజ్జి నజ్జి అయిపోవట్టింది' అనుకొని ఓ ఉపాయం జెప్పింండ్రు. 'ఓరి మనుమండ్లు మీరు దున్ని, నీల్లు పోసి,ఎరువుకొట్టి, గింజలు పోసి ఇంత కష్టంజేసి ఎర్థం చెయకుండా ఈ ఆట ఏదో జెర వాటమైన తావు జూసుకొని ఆడరాదురా'అని పెద్దోల్లె సలహా ఇచ్చింండ్రు.
బడెయ్యతోపాటు పిల్లలందరికి ఈ సలహా చాలా ఆలోచించదగిందని పించింది. వ్యర్థం కాకుండా ఉండే జాగకోసం దేవులాడింండ్రు. అది మంచినీటి బాయి పక్కపొంటి జాగ. ఎరువును చిన్నగుంతల్లకేంచి పెద్ద గుంతల్ల ఉన్న పెంటలేస్తే వ్యర్థం కాదు. ఆటకు ఆట పొదుపుకు పొదుపు రెండూ ఉన్నయి. అనుకుని పెంటల దగ్గర పొలం సాగుజేసే ఆటను మొదలు వెట్టింండ్రు.

" " " " "

ఇంట్ల మొన్న తెచ్చిన పొయిల కట్టెలు అయిపోయినయి. పొద్దు మూకి వంటజెయ్య ఒక్కకట్టెపుల్లలేదు 'ఏరుకొత్తం బిడ్డా రా రాదురా బడెయ్యా' అని ఎల్లమ్మ అడిగింది. అడిగిన మాటను కాలిచేయకుండా తల్లెంబడి తయారైయిండు బడెయ్య. పొద్దు పడమర దిక్కు జేరుతున్నది. చీకటివడనీకె శానా పొద్దులేదు. 'గిప్పుడు కట్టెలకు

పోయి ఎప్పుడొస్తం చీకటైతె ఎట్ల' అనుకున్నడు బడెయ్య.

మరి రాత్రికి పొయిలకు లేకపోతె బువ్వెట్ల ఒండుడు పోక తప్పదు. ముందే మా అవ్వకు రేజికట్లు, జెర్ర సందెల్ల అయిందంటే కండ్లు కనవడక ఓ పక్కకు కూసుంటది. ఏదైన చెయ్యాలన్న, చెప్పాలన్న నన్నే అడుగుతది. మరి గీ యాల్లకు కట్టెలకు పోతే ఎట్ల అనుకున్నడు. ఊ....నేనున్న కదా జెల్దినపోయి దొరికినన్ని కట్టెలు మోపుకట్టుకొని ఒస్తేకాదా అనుకొని 'అవ్వా నడువ్ కట్టెలకు' అన్నడు.

పలుపుతాల్లు సేతులవట్టుకొని బయలెల్లిండ్రు తల్లి కొడుకు. పల్లెకు మూడు పర్లాంగుల దూరమున్న పాడువడ్డ కందికొయ్యలున్న సేన్ల పుల్లలేరవట్టిండ్రు.

అదే సమయంల పొలం పక్కపొంటి ఉన్న బాటెంబడి రామరెడ్డి దొర సెత్తిరి వట్టుకొని పోతూ కనిపించిండు. ఎల్లమ్మ దొరను జూసిన ఎంబటే కాల్లసెప్పులిడిసి పక్కకు నెట్టి కట్టెలేర ఒంగింది. అడుగు తీసి అడుగేస్తే ఆచేండ్ల పల్లెరుముండ్లు పరుపులు గట్టి ఉన్నయి. చెప్పులు లేని ఎల్లమ్మ కాల్లకు గుచ్చుకుంటున్నయి. పల్లెరుగాయలు చాలవన్నట్లు ఇంత పొడుంగున్న కందికొయ్య కాలుకు చాకులాగ దిగింది. అరికాలునుండి బలబలా నెత్తురు కారవట్టింది. బాదనంత పంటికింద బిగవట్టి 'సస్తిరాబడెయ్యా' అన్నది. బడెయ్య ఉరికొచ్చి కందికొయ్యను కాలుకెంచి పీకి, జెర్రంత రక్తంను పిండేసిండు. ఒరం మీదికురికి నల్లలం ఆకులను బరుక్కొచ్చి అరిచేతుల నలిపి గాయంకు పెట్టిండు. ఆకుడొప్పల్ల సెలిమలకేంచి నీల్లుతెచ్చి తాపిండు. 'అవ్వా....ఇంతకింత చీకటిగమ్మవట్టె నీవిక్కన్నే కూకో ఇంకొన్ని పుల్లలేరి మోపుకట్టుకొని పోదం' అన్నడు. బడెయ్య కాళ్ళకు తండ్రి చేసిచ్చిన తోలుసెప్పులేసుకున్నడు. సేండ్ల ఉర్కిఉరుకి పుల్లలేరుతుంటే పల్లెరు గాయముండ్లు సెప్పుల కింద నలిగిపోతున్నయి. ఏరిన పుల్లలన్ని ఒక దగ్గర పేర్చి పలుపుతాడుతో కట్టెమోపును గట్టిండు. మోపెత్తుకునే ముందు అవ్వను చెయివట్టి లేపి పక్కకు నిలవెట్టి సెప్పుల కోసం జూసిండు. అవి కనిపించలేదు. నాలుగడుగులు ముందుకు నడిసి అటు ఇటు జూసిండు. అంత దూరాన కుక్క నోట్ల కర్సుకపోయి చెప్పులను పీక్కతింటున్నది. అప్పటికే అవి తుకుడలైపోయినయి. వాటిమీద ఆశవదిలి తల్లికొడుకు ఇంటి బాట వట్టిండ్రు. కుంటుకుంట మెల్లగా నడుస్తున్న ఎల్లమ్మ 'కాల్లకున్న సెప్పులు ఇడిసింది తడువే లేదు. కందికొయ్య పాల్నవడితి. కట్టెలేరే గడియకే యమినోడొచ్చినట్లొచ్చె దొర. గందుకె నేను కందికొయ్యగండంల వడితి. ఇప్పుడేమో నా పానానికి కుక్క సెప్పులెత్తుకపొయేదే తక్కువయ్యిండెనా? తిందమనుకున్న కుక్కకు నాసెప్పులయితె దొరికే కాని, ఏస్కుందమనుకున్నప్పుడు నాకు సెప్పులే లేకుండాపాయె. ఆ కుక్క బతుకు నా బతుకుకన్న నయంగాదా రా బడెయ్య' అనుకుంట తన గోసను ఎల్లబోసింది ఎల్లమ్మ. మాదిగోల్లమైనందకు సచ్చిన పశువులను గుంజి కోసుడు, వాటి తోళ్ళు వలిసి సెప్పులు కుట్టుడు మన మీద వడ్డది. మీ బాపేమో ఊరందరికి పెద్ద చిన్న చితక కులాలోల్లందరికి సెప్పులు కుడుతడు. బురద, రాల్లు, రప్పలు, ముండ్లు, కొయ్యలు, పురుగుబుట్టల నుండి కాపాడేది మనం కుట్టే చెప్పులే గదరా. అందరి కాల్లను కాపాడేది మనమైతిమి. ఇప్పుడేమో నాకాల్లకే దిక్కులేదురా'. అని ఒక్క మూలుగు మూలిగి నిట్టూర్చింది. 'జెర్రసేపు ఓ పక్కకు కూసుంటరా బడెయ్య' అన్నది అవ్వ. సరే అని కూసుండ వెట్టిండు. కాని అవ్వ మాట్లాడే మాటలు బడెయ్య గుండెకు తగులుతున్నయి. మనుసు అవ్వకోసం తల్లడిల్లుతున్నది. అవ్వ అన్న మాటలు సెవుల్ల ఇనవడుతూనే ఉన్నయి. సెప్పులున్నా

దొరముందేసుకునుడు కాదు. కానందుకే అవ్వకు కందికొయ్య గుచ్చుకున్నది అవ్వ నీరసించి పోయింది. ఇంటి నుండి కట్టెలకు పొయేటప్పుడు సటా సటా నడ్సిన అవ్వ ఇప్పుడు ఎన్కకు ఇరీగలవడుతున్నది. బడెయ్యకు లోలోన ఉక్రోసం పెరిగింది. 'దొర ఒస్తే ఒచ్చె సెప్పులెందుకిడిస్తివే' అని ఎప్పటి నుండో అనాలనుకుంటున్న మాటను బయటికి అనేసిండు. 'బడెయ్యా.... సెప్పులిడ్వకుంటే వాల్లూకుంటారా? ఇప్పుడు చూసి చూడనట్లే నేనున్ననుకో దొరకూడ చూసి చూడనట్లే ఉండి దాన్నిమన్సులబెట్టుకోని కక్షవడ్తడు. అదను జూసి కక్ష తీర్చుకుంటడు. 'అనుముల్ల కుట్టు మినుముల్ల తీసుడంటరు' అంటరు జూడు గట్లనే. వాళ్ళతో షెరుతులకు పోతే బతుకుతామా బడెయ్యా ? కాలుకు కందికొయ్య కొట్టినా, ఇసప్పురుగ ముట్టినా, ఈ బాద ఈ దినముండి రేపు మానుతది. గాని దొర కులంకు పెయ్యంత ఇసమే రా బడెయ్య. సచ్చిందాక పగవడుతరు. వాళ్ళతో తాకనాడాలంటే కులం బలం, తెలివిబలం భూమిబలం కావాలె. మనకంటవా ఇందుట్ల యా బలంలేదు.' అని ఎల్లమ్మ అంటుండంగనే చీకట్లు కమ్మినయి. రేచీకట్ల మూలంగా ఎల్లమ్మకు కండ్లు అసలే కనిపిస్తలేవు. ఒక చేత నెత్తి మీది కట్టెలమోపును ఇంకో చేత్తో అవ్వను వట్టుకొని తోలుకొస్తున్న బడెయ్య పరి పరి విధాల ఆలోచిస్తున్నడు. 'కొంతసేపు కాల్లకు చెప్పులు లేనందుకే అంత పెద్ద కందికొయ్య దిగవడింది. దొరపోయినంక ఏసుకుందమని సూస్తె సెప్పులను కుక్కెత్తుకపోయి మొత్తమే లేకుండ ఆయె. అవ్వ రేపు తంగెడు చెక్కకొరకు అడివికి పోవాలె. సెప్పుల్లేకుండా ఎట్లా పోతది'. అని పరి పరి విధాల ఆలోచిస్తూ నడుస్తున్నడు. ఉన్నట్లుండి మనుసులో ఏదో ఆలోచన తట్టింది. అది తట్టంగనే మనుసు కాస్త నిమ్మలమైనట్టున్నది. అవ్వను తీసుకొని ఇంటికి జేరిండు.

లందకాడున్న గూడు తలుపులు తెరిసి బాపు దాసిపెట్టిన తోల్లను తీసుకుపోయి సింతసెట్టు కింద ఉన్న లంద గోలెంల నానేసిండు. ఇంట్ల రాత్రి బువ్వ తినుడుఅయిపోయినంక నిద్రపోయింద్రు. బడెయ్య మాత్రం నిదురపోలేదు. మనసంత లందగోలెంల నానేసిన తోల్లమీదనే ఉన్నది. నడిజాము పొద్దుకు లేసిండు. బాయిలకేంచి తోల్లను బయిటకు గుంజి బాపు తోలు సంచిలకేంచి సెప్పులుకుట్టే సామాను తీసుకొన్నడు. చెప్పులకు కావాల్సినంత తోలును రంపెతోని తీసుకున్నడు. తల్లి కాల్ల కొలత చూసుకొని పాదం, కప్పులు, ఉంగటాలు తయారు చేసిండు. చెప్పులు కుట్టిండు. మొలలు కొట్టిండు. వాటికి పైపైనపాలీసు పూసి కొత్త చెప్పులు చేసిండు. తంద్రంత సునాయిసంగా, అందంగా చెప్పులు కుట్టరాకపోయినా తెల్లవారితే అడివికి పోనీకె అవ్వకు పనికొస్తయి అని మనుసుల అనుకొని వాటిని బద్రంగా గూట్లపెట్టి యదార్దంగా నిద్రపోయిండు బడెయ్య.

దినాం లెక్కనే తెల్లవారక ముందు ఎంకయ్య నిద్రలేసి 'ఈ పొద్దునేనే అడివికి పోత నీకు కంది కొయ్య కొట్టింది గదనే ఏమొస్తవ్ ఇంట్లనే ఉండు' అన్నడు. రాతిరి పిల్లలు ఒకరెంట ఒకరు కాలుకు ఉడుకువెట్టి కాపిరి. వాయిలాకును వెచ్చగ జేసి కట్టుకట్టిరి. కాలు జెర్రంత మొద్దువారిందిలే పానం జెర్రంత అల్కగనే ఉన్నది. నేనొస్త గాని నాకు సెప్పులు కావాలె. గా రేజీకట్లకు మందు తినాలె. గది జూడయ్య ముందు. ఇంట్లనే ఉండు ఉండు అంటె ఇంట్ల ఎట్ల ఉంటరు పని లేకుండా' అన్నది

ఎలమ్మ. 'చెప్పులైతె జేసిస్త గని గిపుడాద? రేపు జేసిస్త రేజీకట్లది మాత్రం నా చేతుల లేమున్నది సెప్పు. నీవె ఓపిక తెచ్చుకోని మన పిల్లల వెంబడేసుకొని పొద్దుమూకెల్ల ఏడిండ్లు తిరిగి తిండి అడుక్కొని మూడు వారాలు

తింటె పోతదని ఎప్పటి నుండో జెపుతున్న. నీవు పెడసెవిన పెడుతున్నవు' అన్నడు. 'నీ అదుక్కతినుడుల మన్నుబొయ్య అదుక్కుతినాలంటే మా సెడ్డగనిపిస్తదయ్యా' అన్నది ఎల్లమ్మ. ఏం బిచ్చమడగనీకె మంది దగ్గరికి పోతున్నవా? పరాయోళ్ళ దగ్గరకు పోతున్నవా? మనోళ్ల దగ్గరి కే గదా. మన గోత్రం, మన కాందానోళ్ళ దగ్గరికే గదా! అడగనీకె పోయ్యేది ఎందుకు సిన్నతనం' అని ఎంకయ్య సర్ది చెప్పిండు. అయితె ఈ పొద్దు నీకు సెప్పులు లేవు కదా! నా సెప్పులేసుకో రేపు నీకే కుడుత' అని తన చెప్పులు ఇడువ బోయిండు. అవ్వ అయ్య సప్పుడుకు బడెయ్యకు మెలుకువ వచ్చి దిగ్గున లేసి బయట కొచ్చిండు. సెప్పులిడుస్తున్న తండ్రిని చూస్తూ 'బాపు అవ్వకు కూడ చెప్పులున్నయి నీవిడుసుడెందుకు? అని గూటిలో దాసిపెట్టిన కొత్త చెప్పులను తీసి తల్లి కాల్ల దగ్గర ఉంచిండు. వాటిని చూసి తల్లి దండ్రి ఆశ్చర్యపోయిండ్రు. 'ఎక్కడివిరా బడెయ్యా ఈ సెప్పులు' అని అడిగిండ్రు. 'నేనే గుట్టిన' అని గర్వం, సంబరం కలగలిసిన గొంతుతో చెప్పిండు బడెయ్య. వాళ్ళ కండ్లని వారికే నమ్మసక్కెం గానంత సంబరంతో 'మంచిగనే చేసినవురా' అని ఇద్దరొక్కకంఠంతో పలికిండ్రు తల్లి తండ్రి. 'ఇంకేం నీకొడుకు జేసిచ్చిండు కదా తొడుక్కో' అని సంబరం, సరసం కూడిన గొంతుతో ఎంకయ్య.

'మరీ....తొడుక్కోనా ఏంది నీవేనా సెప్పులు గుట్టేది నా సిన్నకొడుకు ముత్తయ్య లేడు. ఆడు నా బంగారుకొండ. మాబాపు మైసయ్య ఉన్నడుగదా, బడెయ్య ఉన్నడుగా ఆడే నా సిన్నకొడుకు. దేన్ని చూసినా శేస్తడు ఎవ్వరు పనిగట్టుకొని నేర్పియ్య నవసరం లేదు. అని గుక్కతిప్పుకోకుండా పొగిడింది. అడవికెల్లి ఒచ్చినంక ఆదినమంతా ఎల్లమ్మ ఊరంతా జెప్పుక తిరిగింది. 'నా సిన్నకొడుకు సెప్పులు కుట్టిచ్చిండు సూడుండి మా వోడు 'సూస్తె సాలు ఇగ శేత్తడు' అని.